క్లుప్తంగా

ఆలయానికి మకరతోరణం బహూకరణ



అభయాంజనేయ స్వామి ఆలయానికి మకరతోరణం బహూకరిస్తున్న దృశ్యం

మునగపాక : మునగపాకలోని సంతబయిల అభయాంజనేయ స్వామి వారికి రూ.15వేలు విలువ చేసే మకర తోరణాన్ని ఆదివారం బహుకరించారు. మునగపాక గ్రామానికి చెందిన స్వర్గీయ దొడ్డి శ్రీరాములు కుమారులు దొడ్డి గంగసూరప్పారావు, దొడ్డి రమేష్ ఆలయ కమిటీ చైర్మన్ మణికంఠకు అందజేశారు. ఆలయ అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని మణికంఠ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆడారి గోవింద, శరగడం జగన్, దాడి నాయుడు, కాశీ, సత్యనారాయణ,మాధవ్,రవి పాల్గొన్నారు.

విశ్రాంత హైకోర్టు జడ్జి సతీమణికి నివాళులు



విశ్రాంత హైకోర్టు జడ్జి సూరప్పారావు సతీమణి నాగేశ్వరమ్మకు నివాళులర్పిస్తున్న దృశ్యం

మునగపాక : నాగులాపల్లిలో ఆదివారం విశ్రాంత హైకోర్టు జడ్జి వేగి సూరప్పారావు సతీమణి నాగేశ్వరమ్మ ప్రథమ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరమ్మ చిత్రపటానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాడి వీరభద్రరావు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సూరప్పారావు కుటుంబ సభ్యులను వీరభద్రరావు పరామర్శించారు. పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు వేగి సోమేశ్వరరావు, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు దొడ్డి వరహా సత్యనారాయణ పాల్గొన్నారు.

మల్లవరంలో క్రీడా పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మల్లవరం సర్పంచ్ హేమలత

మునగపాక : క్రీడల ద్వారా మానసిక ఉల్లాసంతో పాటు శరీర ధారుడ్యం పెరుగుతుందని మల్లవరం సర్పంచ్ ఇందల హేమలత పేర్కొన్నారు. ఎస్‌బీఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మల్లవరం పంచాయతీ పరిధిలోని పిల్లలకు పలు రకాల ఆటల పోటీలు నిర్వహించారు. పోటీలను ప్రారంభించిన హేమలత మాట్లాడుతూ మల్లవరం పంచాయతీని ఎస్‌బీఐ ఫౌండేషన్ దత్తత తీసుకోవడం సంతోషకరమన్నారు క్రీడలను ప్రోత్సహించేందుకు ఫౌండేషన్ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేత ఇందల నాయుడు, ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వరి నాట్లు



మండలంలో వరి నాట్లు వేస్తున్న రైతులు

పాయకరావుపేట : మండలంలో గల ఆయా గ్రామాల పరిధిలో రైతులు వరినాట్లు ముమ్మరంగా వేస్తున్నారు. వర్షాలు కురవడం ఆలస్యం అయినప్పటికీ ముందుగా బోర్లు వద్ద పొలాలను రైతులు వరి నాట్లు వేస్తున్నారు. మండలంలో 3200 హెక్టార్లలో వరినాట్లు వేయవలసి ఉంది. రైతులు ఇంతవరకు 300 హెక్టార్లలో మాత్రమే వరి నార్లు వేశారు. కాగా శుక్ర, శని వారాల్లో కురిసిన వర్షాలకు రైతులు చురుగ్గా దమ్ములు పట్టి వరి నార్లు వేస్తున్నారు. మండలంలో గల మంగవరం, అరట్లకోట, గుంటపల్లి, పెదరాంభద్రపురం, శ్రీరాంపురం తదితర గ్రామాల్లో వరి నాట్లు వేస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారుల అంచనా ప్రకారం వారం, పది రోజుల్లో వరినాట్లు పూర్తిగా వేయడం జరుగుతుందని భావిస్తున్నారు.

జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభం

మునగపాక : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జనసేన విజయమే లక్ష్యంగా పాటుపడాలని ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ సుందరపు విజయకుమార్ పిలుపునిచ్చారు. మునగపాకలో ఆదివారం జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభించి పార్టీ జెండానుఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. పార్టీ నేతలు జనపరెడ్డి శ్రీనివాసరావు, టిక్కలి పరశురామ్ తదితరులు పాల్గొన్నారు.

విత్తనశుద్ధితో...తెగుళ్లకు చెక్

- వైఎస్సార్ పొలంబడిలో అవగాహన కల్పిస్తున్న అధికారులు
- గ్రామస్థాయిలో అధికారులు, సిబ్బంది ప్రచారం



వరిలో విత్తనశుద్ధిపై అవగాహన కల్పిస్తున్న అధికారులు



విత్తన శుద్ధి చేసిన అనంతరం నాటిన వరిపైరు

మునగపాక : రైతులు విత్తన శుద్ధి చేపట్టడం ద్వారా తెగుళ్లను నివారించడంతో పాటు అధిక దిగుబడులు పొందేందుకు ఆస్కారం ఉంటుంది. రైతు సంక్షేమం కోసం ఇప్పటికే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు మరెన్నో పథకాలను అమలు చేస్తూ వారిలో భరోసా నింపుతున్నారు. ఖరీఫ్‌లో రైతులకు ఆర్‌బీకేల ద్వారా విత్తనాలను అందజేశారు. తెగుళ్ల నివారణకు ప్రభుత్వం వైఎస్సార్ పొలంబడి కార్యక్రమంలో భాగంగా విత్తనశుద్ధి అందుబాటులోకి తీసుకువచ్చింది. నారుమడుల్లో విత్తనాలు జల్లకముందే విత్తన శుద్ధి చేయడం ద్వారా తెగుళ్లను నివారించవచ్చంటూ వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

సుడోమోషన్‌తో విత్తనశుద్ధి

ప్రతి పంట సాగులోనూ తెగుళ్ల బెడద సహజం. ప్రధానంగా వరి పంటలో తెగుళ్ల బెడదను నివారించేందుకు వ్యవసాయాధికారులు విత్తనశుద్ధి కార్యక్రమం నిర్వహిస్తున్నారు. విత్తనం, నేల ద్వారా వచ్చే తెగుళ్లను అరికట్టేందుకు విత్తన శుద్ధి దోహదపడుతుందని అధికారులు వివరిస్తున్నారు. 30 కిలోల విత్తనాల్లో 250 గ్రాముల సుడోమోషన్, 90 గ్రాముల కార్బండిజమ్ కలిపి 24 గంటల పాటు ఊరిన తరువాత పంట పొలాల్లో విత్తనాలు జల్లుకోవాల్సి ఉంటుంది. తక్కువ ఖర్చుతో విత్తనశుద్ధి చేసుకోవడం ద్వారా రైతులకు మేలు జరుగుతుందని అవగాహన కల్పిస్తున్నారు. వరిలో సోకే పొడతెగుళ్ల, అగ్గి తెగుళ్లకు విత్తనశుద్ధి ఒక్కటే మార్గం..

పొలంబడితో రైతులకు మేలు



వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం రైతులకు మేలు చేకూరుస్తుంది. గతంలో విత్తనశుద్ధిపై అవగాహన కల్పించేవారు కాదు. దీంతో పంటంతా తెగుళ్లబారిన పడాల్సి వచ్చేది. దీనికితోడు ఖర్చు కూడా పెరిగిపోయేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులకు పలు సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు విత్తనశుద్ధిపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

– కాండ్రేగుల కిరణ్‌కుమార్, రైతు, చూచుకొండ

తక్కువ ఖర్చుతో తెగుళ్ల నివారణ



తక్కువ ఖర్చుతో విత్తన శుద్ధి చేసుకుంటే తెగుళ్లను నివారించవచ్చు. రైతులపై ఎటువంటి భారం లేకుండా వైఎస్సార్ పొలంబడి కార్యక్రమంలో భాగంగా విత్తన శుద్ధిపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– జ్యోత్స్నకుమారి, మండల వ్యవసాయాధికారి

400 మందికి కంటి పరీక్షలు



అచ్యుతాపురం బ్రాండిక్స్‌లో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): బ్రాండెక్స్ అపెరల్ సిటీలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 400 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 262 మందికి ఉచితంగా కళ్లద్దాలు అందజేశారు. 97 మందికి మందులు అందజేశారు. 52 మంది కాటరాక్ట్ సర్జరీ చేయించుకోవాలని సూచించారు. విశాఖపట్నానికి చెందిన శంకర్ ఫౌండేషన్ సహకారంతో ఈ కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అదే విధంగా రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో నిర్వహించిన రక్త దాన శిబిరంలో 15 మంది రక్తాన్ని దానం చేశారు. ఆయా శిబిరాలకు విచ్చేసిన వారికి ఫలహారం, మజ్జిగ, భోజన సదుపాయం కల్పించారు. శిబిరాలను సందర్శించిన బ్రాండెక్స్ భారత భాగస్వామి దొరైస్వామి మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగ కల్పనతో పాటు, పరిసర ప్రాంతాల వారికి వైద్య సేవలందించడమే సంకల్పమన్నారు.

బార్క్ నిర్వాసితులకు పరిహారం ఇవ్వాలి



బార్క్ నిర్మాణ నేపథ్యంలో కోల్పోతున్న భూముల్ని చూపిస్తున్న సీపీఎం నాయకులు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలో చేపడుతున్న బార్క్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న తంతడి, రాజన్నపాలెం, దోసూరు, చిప్పాడ గ్రామస్తులకు ప్యాకేజీ అందజేయాలని సీపీఎం నాయకులు కె.సోమునాయుడు, కర్రి అప్పారావు, బుద్ధ రంగారావు పేర్కొన్నారు. ఈ మేరకు వారు ఆదివారం ఆయా భూముల్ని పరిశీలించారు. ముందుగా చేసిన సర్వేలో 600 మంది లబ్ధిదారులు ఉండగా, 130 మంది నిర్వాసితులకు మాత్రమే పరిహారం అందిస్తామనడం సరికాదన్నారు.

వర్షం నీరు పోయే దారేది?..



కోటవురట్ల మెయిన్‌రోడ్డులో నిలిచిపోయిన వర్షపు నీరు

కోటవురట్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట మెయిన్‌రోడ్డు చెరువును తలపిస్తోంది. చిన్నపాటి వర్షానికే రోడ్డులో నీరు నిలిచిపోతోంది. సమీపంలోనే తుపాకుల గెడ్డ ఉన్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా మెయిన్‌రోడ్డు నిత్యం వర్షపు నీటితో వాహనదారులను ఇక్కట్లకు గురిచేస్తోంది. ప్రధానంగా ఇక్కడ డ్రైనేజీలు లేకపోవడంతో వర్షం పడితే చాలు భారీగా నిలిచిపోతోంది. భారీ వర్షం కురిస్తే మెయిన్‌రోడ్డు నిండిపోవడమే కాకుండా ఆ నీరంతా మండల పరిషత్ కార్యాలయాన్ని కూడా ముంచెత్తుతోంది. తుపాకుల గెడ్డ వరకు డ్రైనేజీ తీస్తే సమస్య తీరుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల సమావేశం



సమావేశమైన పూర్వపు విద్యార్థులు

నక్కపల్లి: స్థానిక జెడ్పీ ఉన్నతపాఠశాల 1991–92 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వపు విద్యార్థుల సమావేశం ఆదివారం జరిగింది. అప్పట్లో చదివి వివిధ రంగాల్లో స్థిరపడిన వారంతా ఒకచోట సమావేశమై యోగక్షేమాలు తెలుసుకున్నారు. అప్పుడు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఈ సమావేశంలో ఘనంగా సన్మానించారు. పూర్వపు విద్యార్థుల సమావేశంతో పాఠశాలలో సందడి నెలకొంది.

దైవచింతనతో మానసిక ప్రశాంతత



గరగల ఊరేగింపును ప్రారంభిస్తున్న సీఐ మోహనరావు

అనకాపల్లిటౌన్ : దైవచింతన ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని పట్టణ సీఐ దాడి మోహన్‌రావు అన్నారు. స్థానిక కోట్నివీధి మరిడిమాంబ గరగల ఊరేగింపును ఆయన ఆదివారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగులు ఖాళీ సమయాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలకు హాజరుకావాలని పిలుపునిచ్చారు. 84వ వార్డు ఇన్‌చార్జి, వైఎస్సార్‌సీపీ నేత కోరుకొండ రాఘవ మాట్లాడుతూ ఈనెల 31న అమ్మవారి మహోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కోట్ని శ్రీనివాసరావు వెంకట పద్మ, కుమారులు యశ్వంత్ సాయి, పెద్దేటి యమున ఆర్థిక సహకారంతో అమ్మవారి రథయాత్ర కూడా నిర్వహించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కోట్ని శ్రీనివాసరావు, ఆలయ మాజీ చైర్మన్ అప్పికొండ రవిశంకర్, రాఘవ మిత్ర మండలి సభ్యులు తలారి లక్ష్మీప్రసాద్, కోరుకొండ వాసు, సీతారామరాజు, కె.నాగరాజు, లకిడపు స్వప్న, కేతిరెడ్డి ప్రసాద్ పాల్గొన్నారు.

ధ్యానంతో ప్రశాంత జీవన విధానం



ప్రజలకు గొడుగులు అందజేస్తున్న న్యాయమూర్తి శివకిరణ్

అనకాపల్లిటౌన్ : ధ్యానం ద్వారా ప్రశాంతమైన జీవన విధానాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని థర్డ్ అడిషనల్ సివిల్‌జడ్జి ఎం.శివకిరణ్ అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డు శ్రీరామచంద్రా మిషన్ హార్ట్‌ఫుల్‌నెస్ మెడిటేషన్ కేంద్రం ఆదివారం ఆయన గొడుగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యోగా వల్ల ఒక్కరిలో ఆలోచనా విధానం మెరుగుపడుతుందన్నారు. ఈ ఆలోచనా విధానం ద్వారా భార్యాభర్తల మధ్య మంచి అవగాహన ఏర్పడుతుందని సూచించారు. స్నేహితులు, కుటుంబ బాంధవ్యాలు పెరుగుతాయన్నారు. ఇటువంటి ప్రశాంతమైన జీవన విధానం ద్వారా నేరాల సంఖ్య తగ్గుముఖం పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో కె.చిట్టిబాబు, రాంబిల్లి డీటీ వి.శేషుబాబు, కేంద్రం కో ఆర్డినేటర్ కోలపర్తి జయబాబు, సభ్యులు కె.వి.కె.రావు, జి.మంగయ్య పాల్గొన్నారు.

వలంటీర్ల ఎంపిక కోసం నేడు ఇంటర్వ్యూలు

రాంబిల్లి : మండలంలో పలు గ్రామాల్లో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టుల భర్తీ కోసం సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కె.ఎస్. కొండలరావు తెలిపారు. గోకివాడలో 2, కొత్తూరులో 3, పంచదార్ల, మామిడివాడ గ్రామాల్లో ఒక్కో వలంటీరు పోస్టును భర్తీ చేయడానికి ఈ ఇంటర్వ్యూలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ ఇంటర్వ్యూలకు హాజరుకావాలని ఎంపీడీవో సూచించారు.

నేడు ఎస్.రాయవరంలో 'గడప గడపకు'

ఎస్.రాయవరం: మండల కేంద్రంలో సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో రామచంద్రమూర్తి తెలిపారు. ఉదయం 6 గంటలనుంచి పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు సమక్షంలో కార్యక్రమం నిర్వహణ ఉంటుందన్నారు. అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలు నమోదు చేసుకోవాలన్నారు.

క్యాన్సర్ బాధితురాలికి పీఎం సహాయ నిధి



బాధితురాలు కాకి ఆదిలక్ష్మి కుటుంబసభ్యులకు చెక్కునందిస్తున్న ఎంపీ సత్యవతి

అనకాపల్లిటౌన్ : దేవరాపల్లి మండలం నేలబెల్లి గ్రామానికి చెందిన క్యాన్సర్‌వ్యాధితో బాధపడుతున్న కాకి ఆదిలక్ష్మికి ఎంపీ బి.వి.సత్యవతి తన కార్యాలయంలో ఆదివారం పీఎం సహాయ నిధిని అందజేశారు. బాధితురాలు గతంలో ఎంపీ సత్యవతిని సహాయం చేయాలని అభ్యర్థించారు. ఈ మేరకు ఎంపీ స్పందించి పీఎం సహాయ నిధి ద్వారా రూ.3లక్షల చెక్కును ఆమె కుటుంబసభ్యులకు అందజేశారు.

రేపు డైట్‌లో జాతీయ క్రీడాదినోత్సవం

అనకాపల్లి టౌన్ : స్థానిక డైట్ కళాశాల ఏసీ ఆడిటోరియంలో ఈనెల 29న జాతీయ క్రీడాదినోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నట్టు కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా క్రీడాకారులను సత్కరించనున్నట్టు ఆయన తెలిపారు. మధ్యాహ్నం విందు ఏర్పాటు చేయడమైందన్నారు.

రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ

అనకాపల్లిటౌన్ : స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో ఆదివారం స్వర్గీయ అప్పికొండ బాలకృష్ణ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. బాలకృష్ణ స్నేహితులతో పాటు సేవా సంస్థ సభ్యులు రోగులకు పండ్లు, రొట్టెలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్వేజన ఐక్యవేదిక వ్యవస్థాపకుడు కోరిబిల్లి పరి, సేవా సంస్థ సభ్యులు ఏసుబాబు, సారథి, భాను పాల్గొన్నారు.

పోటీల పరీక్షలతో పోటీతత్వం



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న నాయుడు

అనకాపల్లిటౌన్ : పోటీల పరీక్షలు రాయడం ద్వారా పోటీతత్వం పెరుగుతుందని బాసర అకాడమీ డైరెక్టర్ నాయుడు అన్నారు. స్థానిక అకాడమిలో నవోదయ, సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షల ఆదివారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీటు వచ్చినా రాకపోయినా విద్యార్థులు ఇటువంటి పోటీ పరీక్షలకు హాజరుకావడం ద్వారా వారి సామర్థ్యం మెరుగుపడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అకాడమీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ఏకదశి రుద్రాభిషేకం



తిమ్మరాజుపేటలో శోభాయాత్ర



గోమాతకు పూజ చేస్తున్న భక్తులు



ఏకదశ రుద్రాభిషేకానికి హాజరైన భక్తులు

మునగపాక : తిమ్మరాజుపేటలో ఆదివారం ఏకదశి రుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు. భగవాన్ సత్యసాయిబాబా శతజన్మ ఉత్సవాల్లో భాగంగా ఉదయం నుంచి ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఉదయం గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం గోమాత పూజను ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తజన సందోహం నడుమ ఏకదశ రుద్రాభిషేకం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సాయిబాబా నామస్మరణతో తిమ్మరాజుపేట మార్మోగింది. రుద్రాభిషేకం కార్యక్రమాన్ని తిలకించేందుకు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. స్థానిక సత్యసాయిబాబా భజన మండలి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం భారీ ఎత్తున అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

గ్రంథాలయంలో విద్యార్థులకు పోటీలు



పిల్లలకు మ్యూజికల్ పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

మునగపాక : మండలంలోని వాడ్రాపల్లిలో స్వర్గీయ జోగినాయుడు మాష్టారు 12వ వార్షికోత్సవాల్లో భాగంగా ఆదివారం పిల్లలకు మ్యూజికల్ చైర్స్, ఖోఖో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయం గౌరవ అధ్యక్షులు పెతకంశెట్టి రామజోగినాయుడు, సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. తద్వారా విజ్ఞానం పెరుగుతుందన్నారు. ఆటల పోటీల్లో గెలుపొందిన విజేతలతో పాటు పదో తరగతిలో మెరుగైన మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పెద్దలు మళ్ల వరహా నరసింగరావు, కొణతాల శివరామకృష్ణ, పిల్లా జగదీష్, మళ్ల కన్నుంనాయుడు, రవి, శ్రీనివాసరావు, నాయుడు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేత పిల్లి అప్పారావుకు పరామర్శ



వైఎస్సార్‌సీపీ నేత పిల్లి అప్పారావును పరామర్శిస్తున్న డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ

మునగపాక: వైఎస్సార్‌సీపీ నేత పిల్లి అప్పారావు కుటుంబ సభ్యులను ఆదివారం డీసీసీబీ మాజీ చైర్మన్ యు.సుకుమారవర్మ పరామర్శించారు. పిల్లి అప్పారావు తండ్రి వెంకన్న ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ మేరకు సుకుమారవర్మ సంబంధిత కుటుంబ సభ్యులను పరామర్శించి వెంకన్న మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. వెంకన్న ఆత్మకు శాంతి చేకూరాలని సుకుమారవర్మ ఆకాంక్షించారు. ఆయన వెంట సర్పంచ్ దిమ్మల అప్పారావు, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ,వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, మార్కెట్‌కమిటీ చైర్‌పర్సన్ పిల్లి కనకలక్ష్మి, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కోనపల్లి రామ్మోహనరావు, సచివాలయాల మండల కన్వీనర్ పొలిమేర గణేష్, ఎంపీటీసీలు సూరిశెట్టి రాము, బోడకుర్తి గణేష్ పాల్గొన్నారు.

చంద్రయాన్‌తో పెరిగిన దేశ ఘనత



అచ్యుతాపురం బీజేపీ కార్యాయలంలో మన్ కీ బాత్ ప్రసంగాన్ని వీక్షిస్తున్న బీజేపీ శ్రేణులు

అచ్యుతాపురం (అనకాపల్లి): చంద్రయాన్ ప్రయోగం విజయవంతం అయిన తర్వాత ప్రపంచ దేశాల వద్ద భారత దేశ ఘనత మరింత పెరిగిందని ప్రధాని మోదీ మన్ కీ బాత్‌లో పేర్కొన్నారు. ఈ మేరకు అచ్యుతాపురం మండల బీజేపీ కార్యాలయంలో ప్రధాని మోదీ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని ఆదివారం టీవీలో వీక్షించారు. బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు కూండ్రపు నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ నియోజక వర్గ ఇన్‌ఛార్జ్ కూండ్రు సన్యాసినాయుడు, రాజాన రాజు, యండపల్లి రాజు, చినబాబు పాల్గొన్నారు.

సనాతన సంప్రదాయాలను కాపాడుకోవాలి



సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం

మునగపాక: ప్రతి ఒక్కరూ సనాతన సంప్రదాయాలను కాపాడుకోవాలని సమరసత సేవా ఫౌండేషన్ ఉత్తరాంధ్ర జోనల్ ధర్మప్రచారకులు ఆడారి గంగాధర్ కోరారు. మండలంలోని నాగులాపల్లిలో ఆదివారం సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగర సంకీర్తనతో పాటు భక్తి గీతాలాపన నిర్వహించారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. రోజులో అరగంట పాటు వ్యాయామం చేయాలన్నారు. గ్రామంలోని భజన బృందాలను కలుపుకొని ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ చంద్ర మాలకొండయ్య, సిరియాల సత్యనారాయణ, సబ్ డివిజన్ కన్వీనర్ బీవీ రమణ, కొణతాల వెంకటరావు, కర్రి వాసు పాల్గొన్నారు.

ప్రశ్నించే తత్వాన్ని ప్రజలు అలవర్చుకోవాలి

ప్రిన్సిపల్ సీనియర్ సివిల్‌జడ్జి గంగరాజు



మాట్లాడుతున్న న్యాయమూర్తి గంగరాజు

అనకాపల్లిటౌన్ : సంపూర్ణ విషయ పరిజ్ఞానంతో ప్రశ్నించేతత్వాన్ని ప్రజలు అలవర్చుకోవాలని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్‌జడ్జి జి.గంగరాజు సూచించారు. స్థానిక గౌరీ గ్రంథాలయంలో మండల న్యాయసేవా అధికార సంస్థ, గ్రంథాలయం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏ సమస్యనైనా రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవచ్చని, అందుకు లోక్ అదాలత్ దోహదపడుతుందన్నారు. వివాదాల పరిష్కారానికి ప్రభావంతమైన సాధనం లోక్ అదాలత్ అని అభివర్ణించారు. అల్పాదాయవర్గాల ప్రజలకు లోక్ అదాలత్ ఉచిత న్యాయసహాయం చేస్తుందన్నారు. న్యాయస్థానం లేదా వ్యాజ్యానికి ముందు పెండింగ్ దశలో ఉన్న వివాదాలు/కేసులను సామరస్యంగా లోక్ అదాలత్‌లో పరిష్కరించుకొని, రాజీ చేసుకునే అవకాశముందన్నారు. రెండో అదనపు జూనియర్ సివిల్‌జడ్జి బి.వి.విజయలక్ష్మి, మూడో అదనపు జూనియర్ సివిల్‌జడ్జి ఎం.శివకిరణ్‌లు మాట్లాడుతూ సత్వర న్యాయానికి, న్యాయసహాయానికి లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అందరికీ అందుబాటులో న్యాయాన్ని ఉంచడమే లోక్ అదాలత్ లక్ష్యమన్నారు. అంతకుముందు న్యాయమూర్తులను గ్రంథాలయ సభ్యులు ఘనంగా సత్కరించారు. గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జనశిక్షణాసంస్థాన్ డైరెక్టర్ చొక్కాకుల అప్పలనాయుడు, గ్రంథాలయ అధ్యక్షుడు డి.నూకఅప్పారావు, కోశాధికారి భీశెట్టి కృష్ణ అప్పారావు, సభ్యులు బొడ్డేడ జగ్గ అప్పారావు, కాండ్రేగుల సత్యనారాయణ, టైలరింగ్ శిక్షకురాలు రాపేటి ప్రేమలత పాల్గొన్నారు.